ఉపాధి పనులు ప్రారంభించాలి

వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు బుగ్గప్ప

విలేకరులతో మాట్లాడుతున్న వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు బుగ్గప్ప

పరిగి, ఫిబ్రవరి 26 : జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం పనులు అన్ని గ్రామాల్లో వెంటనే ప్రారంభించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు యు.బుగ్గప్ప డిమాండ్ చేశారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికలలో ఇచ్చిన హామీ మేరకు వ్యవసాయ కార్మికులకు ఆత్మీయ భరోసా కింద సంవత్సరానికి రూ.12వేలు ఇవ్వాలని పేర్కొన్నారు. బుధవారం పరిగిలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ వ్యవసాయ కార్మికులకు ప్రతి ఒక్కరికి ఆత్మీయ భరోసా కింద సంవత్సరానికి రూ.12వేలు ఇవ్వాలన్నారు. గ్రామీణ ఉపాధిహామీ పనిదినాలను 200 రోజులకు, రోజు కూలీ రూ.600లకు పెంచాలని ఆయన డిమాండ్ చేశారు. పని ప్రదేశంలో సదుపాయాలు కల్పించాలని పేర్కొన్నారు. జిల్లాలోని పరిగి, వికారాబాద్, తాండూరు, కొడంగల్ మున్సిపాలిటీల ప్రాంతాలలో సైతం ఉపాధిహామీ పనులు కొనసాగేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. పెరిగిన నిత్యావసరాల ధరలకు అనుగుణంగా ఉపాధి కూలీ రోజుకు రూ.600 వరకు పెంచాలని ఆయన డిమాండ్ చేశారు. ఉపాధిహామీ చట్టాన్ని నిర్వీర్యం చేసేందుకు కేంద్ర ప్రభుత్వం కుట్ర చేస్తుందని ఆయన విమర్శించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి ఎం.వెంకటయ్య, నాయకులు సత్తయ్య, రఘురామ్, హబీబ్ తదితరులు పాల్గొన్నారు.

చోరీ చేస్తుండగా చూసిందని వృద్ధురాలి హత్య

- కేసును ఛేదించిన పోలీసులు
- ముగ్గురు నిందితులు రిమాండ్
- వివరాలు వెల్లడించిన డీఎస్పీ

కేసు వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ శ్రీనివాస్‌రెడ్డి

వికారాబాద్, ఫిబ్రవరి 26: దొంగతనం చేస్తుండగా చూసిందని వృద్ధురాలిని బావిలో తోసి హత్య చేసిన నిందితులను పోలీసులు పట్టుకున్నట్లు వికారాబాద్ డీఎస్పీ శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. బుధవారం వికారాబాద్ జిల్లా క్రేందంలోని డీఎస్పీ కార్యాలంయలో హత్యకు గల కారణాలను మీడియాకు వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 24న మర్పల్లి పోలీస్ స్టేషన్‌లో రెడ్డిగారి విమలమ్మ ఒక ఫిర్యాదు చేసిందని, తల్లి వినోద(60) ఇంట్లో ఒక్కతే ఉంటుందని, అది తెలుసుకొని ఆ ఇంట్లో దొంగలు పడ్డారు. ఆపై ఆమె ను బావిలో తోసి హత్య చేసి చంపారని ఆ ఫిర్యాదులో పేర్కొంది. ఈ కేసును వెంటనే చేధించాలని ఆదేశాలు ఇవ్వడంతో ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేసి దర్యాప్తు మొదలు పెట్టమన్నారు. అదే గ్రామానికి చెందిన సోనైల రాజు, నాయక్ వాడి షఫివుద్దీన్, బేగారి నర్సింహులు పేకాట ఆడేందుకు, మద్యం తాగడానికి బానిసలు అయ్యారన్నారు. సులభంగా డబ్బు సంపాదించాలనే ఉద్దేశ్యంతో అదే గ్రామంలో మృతురాలు తోకల వినోద ఒంటరిగా ఉండటాన్ని గమనించి, దొంగతనం చేయాలని నిర్ణయించుకున్నారు. ఈ నెల 23న అర్ధ రాత్రి వినోద ఇంట్లోకి ప్రవేశించి అల్మారా పగలగొట్టి అందులో ఉన్న రూ.21 వేలు తీసుకొని వెళ్తున్న క్రమంలో వినోద వారిని చూసింది. అదే ఊరు కావడంతో బయట చెపుతుందనే ఉద్దేశ్యంతో వినోద మెడలో ఉన్న బంగారం లాకెట్‌ను లాక్కొని బావిలో తోసి చంపారని డీఎస్పీ శ్రీనివాస్‌రెడ్డి వెల్లడించారు. అరెస్టు చేసిన ముగ్గురిని రిమాండ్ చేసినట్లు తెలిపారు. ఈ కేసు చేధించడంలో పనిచేసిన మోమిన్ పేట సీఐ నవీన్ కుమార్, సీసీఎస్ ఇన్‌స్పెక్టర్ బలవంతయ్య, సీసీఎస్ టీం మోమిన్ పెట్ ఎస్సై అరవింద్ తదితర వారిని డీఎస్పీ అభినందించారు. మీడియా సమావేశంలో మోమిన్‌పేట సీఐ నవీన్‌కుమార్ ఉన్నారు.

భూమిలో వాటా ఇవ్వనందునే తండ్రిని హత్య చేసిన కొడుకు..

పరిగి, ఫిబ్రవరి 26: భూమిలో తన వాటా ఇచ్చేందుకు తండ్రి అంగీకరించకపోవడం వల్లే అబ్దుల్ రహీంను అతడి కొడుకు పీర్ మహమ్మద్ హత్య చేసినట్లు అంగీకరించాడని పరిగి సర్కిల్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. పరిగి మండలం రావులపల్లి గ్రామానికి చెందిన అబ్దుల్ రహీంను హత్య చేసిన అతడి కొడుకు పీర్ మహ మ్మద్‌ను అరెస్టు చేసినట్లు సీఐ పేర్కొన్నారు.

ఈ మేరకు నిందితుడిని విచారించగా రావులపల్లి శివారులోని హైదరాబాద్‌కు చెందిన సిద్దార్థ్‌రెడ్డి ఫామ్‌హౌస్‌లో పనిచేస్తూ అక్కడే నివాసముండే పీర్ మహ మ్మద్ కూలీ పని చేస్తే వచ్చే జీతం కుటుంబ పోషణకు సరిపో నందున, స్వంత భూమి ఉంటే వ్యవసాయం చేసుకొని బతుకవచ్చని నిర్ణయిం చుకొని తండ్రిని తన వాటా భూమి రిజిస్ట్రేషన్ చేసి ఇవ్వాలని అడిగినట్లు తెలిపారు. భూమి ఇచ్చేందుకు తండ్రి అంగీకరించనందునే ఈనెల 24వ తేదీ రాత్రి 8.30 గంటల సమయంలో తండ్రి రహీంను కొడుకు పీర్‌మహమ్మద్ కట్టెతో ఇష్టం వచ్చినట్లు కొట్టగా చికిత్స కోసం తరలిస్తుండగా రహీం మృతి చెందాడని సీఐ తెలిపారు.

ప్రధానమంత్రి ఇంటర్న్‌షిప్ పథకాన్ని

సద్వినియోగం చేసుకోవాలి

వికారాబాద్, ఫిబ్రవరి 26: ప్రధానమంత్రి ఇంటర్న్ షిప్ పథకాన్ని యువత సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ ప్రతీక్ జైన్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. భారత ప్రభుత్వం, కార్పోరేట్ వ్యవహారాల మంత్రిత్వ శాఖ వారు అందించే ఈ పథకం రెండవ దశ ప్రారంభమైందని, ఈ ప్రక్రియ మార్చి 11 వరకు కొనసాగుతుందన్నారు. ఇంటర్న్ షిప్ కి ఎంపికైన విద్యార్థులకు నెలవారి భత్యం రూ. ఐదు వేలు వస్తాయన్నారు. 12 నెలల ఇంటర్న్ షిప్ కాల వ్యవధిలో కనీసం 6 నెలలు ఉద్యోగ శిక్షణ ఉంటుందని తెలిపారు. ఇంటర్న్ షిప్ ద్వారా వాస్తవ ప్రపంచ అనుభవాన్ని పొందగలుగుతారని, ఉపాధి అవకాశాలను మెరుగు పరచుకుంటారని అన్నారు. ఇప్పటికే దాదాపు మూడు లక్షలకు పైగా దరఖాస్తులు సమర్పించినట్లు తెలిపారు. ఇంటర్న్ షిప్ పథకానికి 21 నుంచి 24 సంవత్సరాల మధ్య వయస్సు కలిగిన వారై ఉండాలని, కుటుంబంలో ఎవరూ ప్రభుత్వ ఉద్యోగంలో ఉండకూడదని తెలిపారు. పదవ తరగతి, ఇంటర్మీడియట్, ఐటీఐ, పాలిటెక్నిక్ డిప్లమా, డిగ్రీ పూర్తయి ఉండాలని ఆయన తెలిపారు. సంవత్సర కుటుంబ ఆదాయం రూ. 8 లక్షల లోపు కలిగి ఉండాలని అన్నారు. pminternship, mca.gov.in పోర్టల్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని కలెక్టర్ సూచించారు. క్షుణ్ణంగా పరిశీలించిన తర్వాత మీ దరఖాస్తులను సమర్పించవలసిందిగా కలెక్టర్ సూచించారు. యువత నైపుణ్యాలను పెంపొందించుకోవడానికి , వారి భవిష్యత్తును సురక్షితంగా ఉంచుకోవడానికి ఈ సువర్ణ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాల్సిందిగా కలెక్టర్ తెలిపారు. ఏదేని సమాచారం కోసం 1800 116090 (టోల్-ఫ్రీ) ని సంప్రదించండి లేదా pminternship.mca.gov.in ని సందర్శించాలని కలెక్టర్ సూచించారు.

ఘనంగా ఆలయ వార్షికోత్సవం

దేవుని ఉరేగింపులో నృత్యాలు చేస్తున్న బంజార మహిళలు, యువకులు

పూడూరు, ఫిబ్రవరి 26: పూడూరు మండలం తిర్మలాపూర్ గ్రామంలో తుల్జాభవాని, సేవాలాల్ మహారాజ్ దేవాలయ ఏడవ వార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు. దేవాలయం నుంచి తుల్జా భవానీ మాతను, సేవాలాల్ మహారాజ్ విగ్రహాలతో, డప్పు వాయిద్యాలతో పాటుగా బంజార మహిళలు, పురుషులు ప్రత్యేక నృత్యాలతో గ్రామంలో ఉరేగింపు తీశారు. గత రెండు రోజుల నుండి దేవాలయం వద్ద ప్రత్యేక భజనలు, కీర్తనలు,పూజాలు నిర్వహించారు. కార్యక్రమంలో దేవాలయ కమిటీ చైర్మన్ మేస్త్రి బాలుబంజార సంఘం అధ్యక్షుడు బానుప్రకాష్‌నాయక్, రామునాయక్, రాంజీ నాయక్, కిషన్‌నాయక్, రమేష్ నాయక్, గోపాల్‌నాయక్, లాల్‌లునాయక్, దేవాలయ కమిటీ సభ్యులు ఉన్నారు.

శంషాబాద్ ఎయిర్‌పోర్టులో ఎయిర్‌లైన్స్ అధికారులతో వాగ్వివాదానికి దిగిన ప్రయాణికులు

శంషాబాద్ ఎయిర్‌పోర్టులో

ప్రయాణికుల ఆందోళన

వారణాసికి వెళ్లే విమానం 4 గంటలు ఆలస్యం.. ప్రయాణికుల పడిగాపులు

శంషాబాద్ రూరల్, ఫిబ్రవరి 26: వారణాసి వెళ్లాల్సిన స్పైజెట్ విమానం దాదాపు 4 గంటలు ఆలస్యం కావడంతో శంషాబాద్ ఎయిర్‌పోర్టులో ప్రయాణికులు ఆందోళనకు దిగిన సంఘటన బుధవారం చోటుచేసుకున్నది. ప్రయాణికులు తెలిపిన ప్రకారం.. శంషాబాద్ ఎయిర్‌పోర్టు నుంచి ప్రయాగ్‌రాజ్‌లో జరుగుతున్న కుంభమేళాలో పుణ్యస్నానాలు చేసేందుకు వెళ్తున్న ప్రయాణికులకు స్పైజెట్ ఎయిర్‌లైన్స్ అధికారులు షాక్ ఇచ్చారని తెలిపారు. ఉదయం 10 గంటలకు శంషాబాద్ ఎయిర్‌పోర్టు నుంచి వారణాసి వెళ్లాల్సిన విమానం సమయానికి ఎయిర్‌పోర్టుకు చేరుకున్నదని, ప్రయాణికులు బోడింగ్‌పాసులు తీసుకొని లోపలికి వెళ్లారని చెప్పారు. తర్వాత ఎయిర్‌లైన్స్ సిబ్బంది సాంకేతిక సమస్యతో విమానం ఆలస్యమవుతుందని చావు కబురు చల్లగా చెప్పి వెళ్లిపోయారని ప్రయాణికులు వాపోయారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 4 గంటల పాటు ఎయిర్‌పోర్టులో వేచి చూసిన ప్రయాణికులను ఎయిర్‌లైన్స్ అధికారులు ఎలాంటి సౌకర్యాలు కల్పించలేదని, కనీసం తాగునీరు ఇవ్వడంలేదన్నారు. మధ్యాహ్నం 2 గంటలకు ఎయిర్‌లైన్స్ అధికారులు ప్రయాణికుల వద్దకు వచ్చి సరైన సమాచారం చెప్పకుండానే వెళ్లిపోయారని, కుంభమేళాలో పుణ్యస్నానాలు చేసేందుకు విమానం టికెట్ బుక్ చేసుకున్న మాకు తిరిగి వచ్చే విమానం ఎలా దొరుకుతుందని ప్రశ్నించారు. వేలు పెట్టి టికెట్ తీసుకున్న మాకు కనీసం ఎలాంటి సౌకర్యాలు కల్పించలేదని వాపోయారు. ఎయిర్‌లైన్స్ అధికారులపై చర్యలు తీసుకోవాలని శంషాబాద్‌లోని జీఎంఆర్ ఎయిర్‌పోర్టు అధికారులను ప్రయాణికులు కోరారు. కుంభమేళా చివరి రోజు కావడంతో పుణ్యస్నానాలు ఆచరించేందుకు వెళ్తున్న ప్రయాణికులకు ఎయిర్‌లైన్స్ అధికారులు నిరాశే మిగిల్చారని పలువురు ప్రయాణికులు విమర్శించారు.

కిటకిటలాడిన శివాలయాలు

- భక్తిశ్రద్ధలతో వైభవంగా మహాశివరాత్రి
- ఆలయాల్లో మార్మోగ్రిన శివనామస్మరణ
- ప్రత్యేక పూజలు చేసిన భక్తులు, ప్రజాప్రతినిధులు
- దీక్ష చేపట్టిన భక్తులు శివుడిని దర్శించుకొని దీక్ష విరమణ

తాండూరు: సామూహిక లింగాభిషేకం చేస్తున్న మహిళలు

పరిగి: శ్రీ మల్లికార్జున స్వామి వారి దర్శనానికి బారులు తీరిన భక్తులు

కులకచర్ల: పాంబండ రామలింగేశ్వరస్వామి వారి దర్శనానికి బారులు తీరిన భక్తులు

కొడంగల్: గాడి బావి శివాలంయలో పూజలు నిర్వహిస్తున్న మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి

న్యూస్‌నెట్‌వర్క్, నమస్తే తెలంగాణ: మహాశివరాత్రి పర్వదినాన్ని బుధవారం వికారాబాద్ జిల్లా వ్యాప్తంగా ప్రజలు అత్యంత భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. శివాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. ఉదయం నుంచి ఉపవాసదీక్ష చేపట్టిన వారందరు శివాలయాలకు వెళ్లి పూజలు చేశారు. పరిగిలోని సోమసూత్ర శివాలయంలో స్వామి వారిని ఎమ్మెల్యే రాహన్‌రెడ్డి-ఉమాదేవి దంపతులు దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. అలాగే కులకచర్ల మండల పరిధిలోని బండవెల్కిచర్ల పాంబండ రామలింగేశ్వర స్వామిని, పూడూరు మండల పరిధిలోని దామగుండ రామలింగేశ్వరస్వామి దర్శించుకున్నారు. తాండూ రులోని ప్రసిద్ధమైన అంతారం తండాలోని శ్రీభూకైలాస్ దేవాలయంతో పాటు, బషీరాబాద్ మండలం నీళ్లపల్లిలోని ఏకాంబరి, జీవన్గి, పెద్దేముల్ మండలం తట్టిపల్లి సమీపంలోని అం బురామేశ్వర దేవాలయం, యాలాల మండలం సంగెంకుర్దులోని సంగమేశ్వర దేవాల యంతో పాటు తాండూరు మున్సిపల్ పరిధిలోని శ్రీభావిగి భద్రేశ్వర దేవాలయం, చెరువెంటి ఈశ్వర ఆలయం, అంతప్ప బావి శివాలయం, కోటేశ్వర దేవాలయంతో పాటు పలు శివాల యాల్లో శివుడికి భక్తిశ్రద్ధలతో భక్తులు, ప్రజాప్రతినిధులు, జలాభిషేకం, పాలాభిషేకం, రుద్రా భిషేకం, అర్చనలు చేశారు. శ్రీ శివ సహస్రనామ స్తోత్ర పారాయణ సమితి ఆధ్వర్యంలో శ్రీ భావిగి భద్రేశ్వర దేవాలయంలో శివసహస్రనామ స్తోత్ర అఖండ పారాయణం చేశారు. బ్రహ్మకుమారి సమాజం తాండూరు శాఖ కేంద్రంలో ఇన్‌చార్జి జగదేవి ఆధ్వర్యంలో వేడుకలను ఘనంగా నిర్వహించారు వికారా బాద్ పట్టణంలోని బుగ్గరామలింగేశ్వరాలయం, మల్లికార్జున దేవాలయం, మండల పరిధిలోని పులుసుమామిడి పార్వతీ పర మేశ్వరు ఆలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. బీఆర్ఎస్ వికారాబాద్ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే ఆనంద్, అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్, చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, రాష్ట్ర బీసీ కమిషన్ మాజీ సభ్యుడు శుభప్రద్‌పటేల్ బుగ్గరామలింగేశ్వరాలయంలో పూజలు చేశారు. కొడంగల్‌లోని గాడిబావి శివాలయంలో మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి పూజలు చేశారు.

వికారాబాద్: బుగ్గరామలింగేశ్వర ఆలయంలో మాజీ ఎమ్మెల్యే ఆనంద్..



వికారాబాద్: బుగ్గరామలింగేశ్వర ఆలయంలో రాష్ట్ర బీసీ కమిషన్ మాజీ సభ్యుడు శుభప్రద్‌పటేల్ కుటుంబ సభ్యులు

నీటి గుంతలో పడివ్యక్తి మృతి

తాండూరు రూరల్, ఫిబ్రవరి 26: నీటి గుంతలో ఓ వ్యక్తి పడి మృతి చెందిన సంఘటన కరణ్‌కోట పోలీసు స్టేషన్ పరిధిలో బుధవారం చోటుచేసుకుంది. ఎస్సై విఠల్ రెడ్డి తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి... తాండూరు మండలం, కరణ్‌కోట గ్రామానికి చెందిన అంజిలప్ప(29) తలనొప్పి, జలుబు ఉందని, మెడికల్ దుకాణానికి వెళ్ళి ట్యాబ్‌లెట్ తీసుకు వస్తానని చెప్పి ఇంట్లో నుంచి వెళ్లిపోయాడు. సాయంత్రం అయినా ఇంటికి రాలేదు. చుట్టూ పక్కల, బంధువుల వద్ద వెతికినా ఆచూకీ లభించ లేదు. మృతుడి సోదరుడు ఫోన్ ద్వారా కుటుంబ సభ్యులకు జీవన్గీ వెళ్లే మార్గంలో ఓ నీటి గుంతలో అంజిలప్ప పడి చనిపోయాడని తెలిపారు. అంజిలప్ప మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తాండూరు దవాఖానాకు తరలించారు. మృతుడి భార్య అంజిమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

బాలికపై లైంగిక దాడి..

హిమాయత్ నగర్, ఫిబ్రవరి 26 : బాలికను మభ్యపెట్టి ఓ వృద్ధుడు లైంగిక దాడికి పాల్పడిన సంఘటన బుధవారం నారాయణగూడ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. నారాయణగూడ, కాచిగూడ చౌరస్తాలోని ఓ అపార్ట్ మెట్ లో నివాసం ఉండే 60 ఏండ్ల వృద్ధుడు, అతడి ఇంటి సమీపంలో ఉన్న 9వ తరగతి చదివే బాలిక (14) పై కన్నేశాడు. ఆ బాలికకు మాయమాటలు చెప్పి అపార్ట్ మెంట్ లో కి పిలిచి లైంగిక దాడికి పాల్పడ్డాడు. బాలిక భయంతో ఉండటాన్ని గమనించిన కుటుంబ సభ్యులు ఆరా తీయగా.. జరిగిన విషయాన్ని చెప్పింది. దీంతో బాలిక కుటుంబసభ్యులు నారాయణగూడ పోలీసులకు ఫిర్యాదు చేశారు. బాలికపై లైంగిక దాడికి పాల్పడిన వృద్ధుడిపై పోలీసులు పోక్సో కేసు నమోదు చేశారు. బాలికను భరోసా సెంటర్ కు పంపించి, స్టేట్ మెంట్ ను రికార్డు చేయించారు. ఈ కేసులో వృద్ధుడిని అరెస్ట్ చేయకుండా రాజీ ప్రయత్నాలు సాగుతున్నట్లు సమాచారం. ఈ కేసును ఎస్సై నాగరాజు దర్యాప్తు చేస్తున్నారు.

డీసీఎం బోల్తా..

శంషాబాద్ రూరల్, ఫిబ్రవరి 26: రాజేంద్రనగర్ పరిధిలోని కాటేదాన్ నుంచి షాబాద్ మండలంలోని హైతాబాద్ గ్రామ పరిధిలో ఉన్న కంపెనీలోకి ప్లాస్టిక్ సామన్లతో వెళ్తున్న డీసీఎం కాచారం ఎంటేరు వాగు సమీపంలోకి రాగానే అదుపుతప్పి బోల్తాపడింది. పెద్ద శబ్దం రావడంతో వెంటనే అక్కడికి చేరుకొని పరిశీలించగా.. డ్రైవర్ తప్పించుకొని దూకినట్లు తెలిపారు.

చోరీకి ఫుట్‌పాత్‌లపై అడ్డా..

ఉప్పల్, ఫిబ్రవరి 26 : కిరాణా దుకాణం షట్టర్ తొలగించి అందులో నగదు చోరీ చేసిన నిందితులు పోలీసులకు పట్టుబడ్డారు. ఈ సంఘటన ఉప్పల్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది . పోలీసుల కథనం ప్రకారం.. ఉప్పల్ గాంధీనగర్ లోని మార్కెటింగ్ ప్రాంతంలో హోల్‌సేల్ కిరాణా దుకాణం నిర్వహిస్తున్నారు. కిరాణా దుకాణాన్ని గ్యాన్ చంద్ శర్మ, రామ్ కిశోర్ అనే ఇద్దరు షాపు ను 8 ఏండ్ల నుంచి నడిపిస్తున్నారు. ఈ క్రమంలో శనివారం షాపు మూసివేసి యధావిధిగా ఇంటికి వెళ్లిపోయారు. అయితే ఆదివారం తెల్లవారు జామున షాపు షట్టర్ తొలగించి ఉన్నట్లు సమాచారం తెలుసుకున్న నిర్వాహకులు వచ్చి చూడగా.. షట్టర్ ఓపెన్ చేసి ఉంది. లోపలికి వెళ్లి చూడగా.. దుకాణంలోని రూ.7 లక్షల నగదు చోరీకి గురైనట్లు గుర్తించారు. షాపులోకి వెళ్లే ముందు దొంగలు సీసీ కెమెరాలు బెండ్ చేసి లోపలికి ప్రవేశించారు. చోరీ చేయడం, నగదు దొంగిలించే దృశ్యాలు షాప్ లో ఉన్న సీసీటీవీ కెమెరాలో రికార్డ్ అయ్యాయి. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేశారు.

ఉపాధ్యాయుడు పై పోక్సో కేసు నమోదు..

ఆదిబట్ల, ఫిబ్రవరి 26: విద్యా బుద్ధులు నేర్పాల్సిన ఓ టీచర్ విద్యార్థి వెంట పడి వేధిస్తుండటంతో ఆ విద్యార్థి తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో పోక్సో కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించిన సంఘటన బుధవారం చోటు చేసుకుంది. ఆదిబట్ల సీఐ రాఘవేందర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం ఆదిబట్ల పోలీస్ స్టేషన్ పరిధిలోని నాదర్‌గుల్ లోని ఓ ప్రైవేట్ పాఠశాలలో ఫిజిక్స్ ఉపాధ్యాయుడిగా పని చేస్తున్న మనీష్ (20) అదే పాఠశాలలో పదవ తరగతి చదువుతున్న ఓ విద్యార్థిని పట్ల అసభ్యంగా ప్రవర్తిస్తూ తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నాడు. దీంతో వెంటనే విద్యార్థిని తల్లి దండ్రులు ఆ ఉపాధ్యాయుడి పై ఆదిబట్ల పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీంతో కేసు నమోదు చేసి విచారణ జరిపి అతని పై పోక్సో కేసు నమోదు చేసి బుధవారం రిమాండ్ కు తరలించామని తెలిపారు.

కీసరగుట్టలో బందోబస్తును పరిశీలించిన

రాచకొండ సీపీ సుధీర్‌బాబు

సిటీబ్యూరో, ఫిబ్రవరి 26 (నమస్తే తెలంగాణ): మహాశివరాత్రి సందర్భంగా కీసరగుట్ట బ్రహ్మోత్సవాలకు రాచకొండ పోలీసులు భారీ బందోబస్తును ఏర్పాటు చేశారు. రాచకొండ పోలీస్ కమిషనర్ సుధీర్‌బాబు బందోబస్తు ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆలయం వద్దకు వచ్చిన ఓ భక్తుడికి అనుకోకుండా కాలికి గాయం కావడంతో అతడిని దగ్గరుండి ప్రాథమిక చికిత్స అందించి, అంబులెన్స్‌లో దవాఖానకు తరలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. బ్రహ్మోత్సవాలు ప్రశాంత వాతావరణంలో ఘనంగా జరుగుతున్నాయని, ట్రై పోలీస్ కమిషనరేట్ల నుంచి 2500 మంది సిబ్బంది ఈ బందోబస్తులో పాల్గొంటున్నారని సీపీ తెలిపారు. ఆలయానికి వచ్చిన భక్తులకు ఇబ్బందులు లేకుండా పార్కింగ్ ఏర్పాట్లు చేశామన్నారు. ఆయా విభాగాల అధికారులతో సమన్వయం చేసుకుంటూ ప్రజలకు ఎలాంటి అసౌకర్యం లేకుండా తగిన చర్యలు తీసుకున్నామని, ఆలయం వద్ద చేసిన ఏర్పాట్లను కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్ నుంచి ఎప్పటికప్పుడు పరిస్థితిని సమీక్షిస్తున్నామన్నారు.

పెండ్లి చేసుకోవాలంటూ

వివాహితపై ఒత్తిడి

బంజారాహిల్స్, ఫిబ్రవరి 26: కుటుంబ సమస్యల పరిష్కారంలో సాయం చేస్తానంటూ వివాహితతో పరిచయం పెంచుకొని పెండ్లి చేసుకోవాలని ఒత్తిడి చేస్తూ ఆమెపై దాడి చేసిన ఓ వ్యక్తిపై బంజారాహిల్స్ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. వివరాల్లోకి వెళ్తే.. బంజారాహిల్స్ రోడ్ నం.10లోని జహీరానగర్‌కు చెందిన మహిళ(28) బ్యూటీషియన్‌గా పనిచేస్తుంది. ఆమెకు పదేళ్ల కిందటే ఓ వ్యక్తితో పెండ్లి కాగా, ఇద్దరు పిల్లలున్నారు. 2018లో భర్తకు విడాకులు ఇచ్చిన ఆమె ఇద్దరు పిల్లలతో కలిసి నివాసం ఉంటుంది. కాగా, గత కొంతకాలంగా ఆమెకు కొన్ని సమస్యలు రాగా, వాటిని పరిష్కరిస్తానంటూ ఎర్రగడ్డ సుల్తాన్‌నగర్‌కు చెందిన చెఫ్ అమీర్‌ఖాన్(25) పరిచయం పెంచుకున్నాడు. కొన్నాళ్ల పాటు వారిద్దరూ సన్నిహితంగానే ఉన్నారు. ఆ తర్వాత గత ఏడాది జూలైలో పెండ్లి చేసుకుంటానంటూ అమీర్‌ఖాన్ ప్రతిపాదించగా.. ఆమె నిరాకరించింది. తనకు పెండ్లి ఇష్టంలేదని, ఉద్యోగం కోసం త్వరలో తాను సౌదీ అరేబియా వెళ్తున్నానంటూ చెప్పింది. అప్పటి నుంచి అమీర్‌ఖాన్ ఆమెపై కక్ష పెంచుకొని.. తనను వదిలిపెట్టి ఎలా సౌదీ వెళ్తావో చూస్తానని వేధింపులకు గురి చేస్తున్నాడు. నాలుగు నెలల కిందట ఆమె ఇంటికి వచ్చి పాస్‌పోర్ట్ లాక్కెళ్లాడు. ఇటీవల అర్ధరాత్రి మరోసారి ఆమె ఇంటికి వచ్చిన అమీర్ బలవంతంగా లోనికి వచ్చి దాడి చేయడంతో పాటు సెల్‌ఫోన్లు లాక్కుని వెళ్లిపోయాడు. దీంతో ఆమె ప్రాణభయంతో కనిపించకుండా వెళ్లింది. దీంతో అతడు ఆమె కుటుంబసభ్యులకు ఫోన్లు చేస్తూ ఆమె ఆచూకీ చెప్పకపోతే అంతు చూస్తానంటూ బెదిరించాడు. దీంతో బాధితురాలు బుధవారం బంజారాహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేయగా.. బీఎన్ఎస్ 329(4),115(2),307,351(2), 351(2)(3) సెక్షన్ల కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

పెండ్లి పేరుతో మోసం.. కేసు నమోదు

బంజారాహిల్స్, ఫిబ్రవరి 26: మంచి జీవితం ఇస్తానని నమ్మించి వాట్సాప్ వీడియోకాల్స్‌లో నిఖా చేసుకుని వీడియో కాల్‌లో అసభ్యకరంగా ఉన్న వీడియో, ఫొటోలు తీసుకున్నాడు. ఏడాది గడిచినా తనతో కాపురం చేయకపోవడంతో పాటు వీడియోలు, ఫొటోలు బయటపెడ్తానంటూ బ్లాక్‌మెయిల్ చేస్తుండటంతో పాటు మొదటి భార్యతో కలిసి బెదిరింపులకు దిగాడు. పెండ్లి పేరుతో మోసం చేసి వేధింపులకు గురి చేసిన వ్యక్తితో పాటు అతడికి సహకరించిన మొదటి భార్య పైన బాధిత మహిళ ఇచ్చిన ఫిర్యాదుతో సౌదీలో ఉంటున్న వ్యక్తిపై ఫిలింనగర్ పోలీసులు పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. వివరాల్లోకి వెళ్తే.. టోలీచౌకి సమీపంలోని ఏజీఎన్ కాలనీలో నివాసం ఉంటున్న మహిళ(36) భర్తతో విడిపోయి ఇద్దరు పిల్లలతో నివాసముంటుంది. ఆమెకు కామన్ ఫ్రెండ్స్ ద్వారా వాట్సాప్‌లో అరేబియాలోని రియాద్ నగరంలో నివాసం ఉంటూ పౌల్ట్రీ వ్యాపారం చేస్తున్న మహ్మద్ అబ్దుల్ ఆహద్(39) పరిచయమయ్యాడు. తనది పాతబస్తీలోని మొఘల్‌పుర అని, తన మొదటి భార్యతో విడాకులు తీసుకుని రెండో పెండ్లి కోసం చూస్తున్నానంటూ ఆమెను నమ్మించాడు. పెండ్లి చేసుకున్న తర్వాత ఇల్లు కొనివ్వడంతో పాటు కాపురానికి తీసుకువెళ్తానని చెప్పాడు. దీంతో అతడి మాటలు నమ్మిన ఆమె గత ఏడాది ఏప్రిల్‌లో వాట్సాప్ వీడియో కాల్‌లో టోలీచౌకిలోని ఖాజీ సమక్షంలో పెండ్లి చేసుకున్నారు. మరుసటిరోజున ఆన్‌లైన్‌లో నిఖా నమోదు చేశారు. ఈ పెండ్లికి సంబంధించిన బాధ్యతలు తన తరపున చూస్తాడని బహదూర్‌పురాకి చెందిన అబ్దుల్ రజా అనే వ్యక్తిని పవర్ ఆఫ్ అటార్నీగా అబ్దుల్ ఆహద్ నియమించాడు. పెండ్లయినప్పటి నుంచి వాట్సాప్‌తో పాటు జంగీ యాప్ ద్వారా మహిళతో వీడియో కాల్స్ మాట్లాడిన అహద్ ఆమెతో నగ్న వీడియోలు తీసుకోవడం, కోరిన విధంగా ఫొటోలు తెప్పించుకున్నాడు. త్వరలోనే తాను ఇండియా వచ్చి కాపురానికి తీసుకువెళ్తానంటూ నమ్మించాడు. దాంతో అతడు చెప్పినట్లు వీడ